
andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 43.5, కనిష్ఠం 27.9

నిజామాబాద్
జిల్లా వార్తలు



శుక్రవారం 2 మే 2025

సాగునీటి శాఖ ఎస్ఈగా రామారావు

నిజామాబాద్, మే1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా సాగునీటి శాఖ ఎస్ఈగా రామారావు గురువారం జిల్లా సాగునీటి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆర్మూర్ ఈఈగా పనిచేస్తున్న ఆయనకు ఎస్ఈగా బాధ్యతలను అప్పచెప్పారు. ఇప్పటి వరకు ఎస్ఈగా పనిచేసిన భద్రినారాయణ ఉద్యోగ విరమణ చేయడంతో ఆ బాధ్యతలను ఆయనకు అప్పచెప్పారు. ఆర్మూర్ ఈఈగా పనిచేస్తూనే ఆయన ఈ బాధ్యతలను నిర్వహించనున్నారు.



నీటిలో చేపలను తింటున్న ఫ్లెమింగో పక్షులు

ఎస్సారెస్పీ తీరప్రాంతంలో
విదేశీ పక్షుల సందడి

డొంకేశ్వర్, మే 1(ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ తీర ప్రాంతంలో ఈసారీ భారీగా వలస పక్షులు తరలివచ్చాయి. పర్యాటకులను విదేశీ వలస పక్షులు కనువిందు చేస్తున్నాయి. ప్రతీ సంవత్సరం ఏప్రిల్ వచ్చిందంటే ఇక్కడికి నాలుగు రకాల జాతుల వలస పక్షులు పెద్ద సంఖ్యలో తరలివస్తాయి. ప్రకృతి ఒడిలో హాయిగా సేద తీరుతున్నాయి. ఫ్లెమింగో, పెలికన్స్ జాతి పక్షులు మండలంలోని చిన్నయానం గ్రామ పరిధిలోని ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో కనువిందు చేస్తున్నాయి. నీటిలో కొంగలు గుంపులు గుంపులుగా ఒంటికాలితో నిలబడి నీటిలో ఉన్న చేపలను ఆహారంగా తీసుకుంటున్నాయి. నీటిలో మునిగి లోతుగా ప్రయాణం చేసి చేపలను పట్టుకుంటాయి. వీటి రెక్కలు పైభాగాన నలుపు లేక గోధుమ రంగు మచ్చలు ఉంటాయి. ఫ్లెమింగో పక్షులు సాధారణంగా ఎర్రటి రంగు కలిగి ఉంటాయి. ఆఫ్రికా నుంచి నగరాలకు వలస వస్తాయి. ఈ పక్షులు సరస్సుల సౌందర్యానికి అలంకారాలుగా మారిపోతాయి. ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తాయి. ఫ్లెమింగో పక్షులు లేత గులాబీ ఎరుపు రంగులతో ఉంటాయి. అవి తినే ఆహారంలో ఉండే నీటి పక్షు క్రిములను కెరోటిన్ కారణంగా ఈ రంగు ఉంటుంది. ఫ్లెమింగోలు చాలా సమయం పాటు ఒక కాలుమీద నిలబడుతాయి. వీటిని చూస్తూ పర్యాటకులు సందడి చేస్తున్నారు. గుబురుగా పెరిగిన గడ్డి, చెట్లలో ఇవి ఆవాసం ఏర్పరుచుకున్నాయి. వీటితో పాటు కృష్ణ జింకలు కూడా బ్యాక్‌వాటర్ పరిధిలో సంచరిస్తున్నాయి. వర్షాలు మొదలవగానే ఈ పక్షులు తమ ప్రాంతాలకు వెళ్లిపోతాయి.

రక్షణ చర్యలు చేపడతాం..
: సుధాకర్, ఫారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి, డొంకేశ్వర్



ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ తీరప్రాంతంలో ఫ్లెమింగో, పెలికన్స్ వలస పక్షులు భారీగా వచ్చాయి. వీటితో పాటు కృష్ణజింకలు కూడా ఉన్నాయి. వీటి రక్షణకు చర్యలు చేపట్టాం. ప్రజలు కూడా వీటి సంరక్షణకు సహకరించాలి.





ఏటా టెండర్ నిర్వహిస్తే ఎస్సారెస్పీకి భారీ ఆదాయం..

ఎస్సారెస్పీ నుంచి నల్లమట్టిని ప్రతీ సంవత్సరం రైతులు తవ్వి తీసుకువెళ్తారు. కొన్నేళ్లుగా అనుమతులు తీసుకొని కొంత మంది కాంట్రాక్టర్లుగా అవతారం ఎత్తి ఈ మట్టిని తరలిస్తున్నారు. ప్రతిరోజూ సరాసరి 4 నుంచి 500 వాహనాల వరకు మట్టి తరలింపు జరుగుతోంది. వాహనానికి ఇంతా అని నిర్ణయించిన లక్షల రూపాయల ఆదాయం ఎస్సారెస్పీకి వచ్చేది. ఏప్రిల్ నుంచి మే 15 వరకు మట్టిని తరలించి పంట చేనులో వేస్తారు. ఆ సమయంలో ఈ అనుమతులను మంజూరు చేస్తే ఎస్సారెస్పీకి సాలిన కోటి నుంచి రెండు కోట్ల వరకు ఆదాయం రానుంది. ఎస్సారెస్పీ అధికారులు ఉచితంగా అనుమతులు ఇవ్వడం వల్ల కాంట్రాక్టర్లు ప్రతీసీజన్‌లో కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. రైతులకు ఉపయోగపడే మట్టిని అధికారులు ఉచితంగా ఇస్తున్నా కాంట్రాక్టర్లు మాత్రం ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నారు. జిల్లా అధికారులు దీనిపై దృష్టిపెట్టి చర్యలు చేపడితే ఎస్సారెస్పీకి ఆదాయం సమకూరనుంది. ప్రాజెక్టు నుంచి నల్లమట్టిని కెపాసిటీకి మించి తరలిస్తే వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌రావు గుప్త తెలిపారు. మూడు ఫీట్లలోపే తవ్వకాలు చేపట్టాలన్నారు.

యథేచ్ఛగా నల్లమట్టి తరలింపు



- అడ్డూ అదుపూ లేకుండా ఎస్సారెస్పీ నుంచి నల్లమట్టి తరలింపు
- అనుమతుల మాటున జోరుగా మట్టి అక్రమ దందా
- దందాలో ప్రజాప్రతినిధుల అనుచరులు, బంధువులు
- నిత్యం యంత్రాల ద్వారా తవ్వకాలు చేస్తూ భారీ వాహనాల ద్వారా నల్లమట్టి తరలింపు
- ఇసుక లారీని నల్లమట్టికి కూడా టన్నుల చొప్పున అనుమతి ఇస్తే ఎస్సారెస్పీకి భారీ ఆదాయం



• ఎస్సారెస్పీ నుంచి నందిపేట మీదుగా మట్టిని తరలిస్తున్న వాహనాలు

నిజామాబాద్, మే1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ)నుంచి యథేచ్ఛగా నల్ల మట్టిని తరలిస్తున్నారు. ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటంతో జోరుగా తవ్వకాలు చేపడుతున్నారు. భారీ వాహనాల ద్వారా తరలింపు చేస్తున్నారు. జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధుల బంధువులు ఈ దందా కొనసాగిస్తుండటంతో కనీసం పట్టించుకోవడం లేదు. ప్రతియేడు వ్యవసాయానికి ఉపయోగించుకునేందుకు తీసుకునే ఈ నల్లమట్టిని ఎస్సారెస్పీ అధికారులే టెండర్లు వేసి తరలింపు చేస్తే శాఖకు భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. నిత్యం వందలాది లారీల ద్వారా మట్టిని తరలిస్తూ లక్షల రూపాయలను ఆర్జిస్తున్నారు. దారి వెంట గ్రామాభివృద్ధి కమిటీలకు కూడా డబ్బులను ఇస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా మట్టిని చేరవేస్తున్నారు. దూరాన్ని బట్టి డబ్బులను వసూలు చేస్తూ ఎక్కడికక్కడ స్థానిక అధికారులను మేనేజ్ చేస్తూ మట్టిని తీసుకువెళ్తున్నారు. నిత్యం వందలాది లారీలు కళ్ల ముందే వెళ్తున్నా కనీసం పట్టించుకోవడం లేదు. కెపాసిటీకి మించి వాహనాల ద్వారా తరలిస్తున్నా సీజ్ చేయడం లేదు. ప్రజాప్రతినిధుల పేరు చెప్పి చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఈ దందా జోరుగా కొనసాగుతోంది.

20 రోజులుగా జోరుగా తరలింపు

ఎస్సారెస్పీ నుంచి నల్లమట్టి 20 రోజులుగా జోరుగా తరలింపు జరుగుతుంది. నందిపేట మండలం ఉమ్మెడ, లోకేశ్వరం మండలం పంచగుడి, డొంకేశ్వర్ మండలం అన్నారం, సిర్పూర్‌తో పాటు ఇతర గ్రామాల నుంచి భారీ ఎత్తున తరలింపు చేపడుతున్నారు. రైతులకు భారీ వాహనాల ద్వారా ఈ నల్లమట్టిని చేరవేస్తున్నారు. ఎస్సారెస్పీ పరిధిలో కొన్ని చోట్ల అధికారులు అనుమతులు ఇవ్వగా పొక్లెయిన్‌లు, ఇతర వాహనాలను వినియోగిస్తూ ఈ నల్లమట్టిని తరలిస్తున్నారు. నిత్యం వందలాది వాహనాల ద్వారా ఈ మట్టి తరలింపు చేస్తున్నారు. టిప్పర్లు, లారీలు, పెద్ద టైర్లు ఉన్న భారీ వాహనాలను వినియోగిస్తూ ఈ తరలింపు చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం నల్లమట్టిని తవ్వకాలు చేసుకుంటూ రైతులు వ్యవసాయానికి ఉపయోగిస్తారు. పసుపు, సోయా, మొక్కజొన్న, కంది, ఇతర పంటలు వేసే భూముల్లో ఎక్కువగా ఈ మట్టిని వేస్తారు. పసుపు రైతులు దిగుబడి వచ్చేందుకు ఎకరాకు 30 నుంచి 40 వాహనాల వరకు మట్టిని రెండేళ్లకొకసారి వేస్తారు. గతంలో రైతులే తవ్వకాలు చేస్తూ ఈ మట్టిని ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా తరలింపు చేసేవారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ మట్టిని కొంత మంది రింగ్‌గా ఏర్పడి ప్రజాప్రతినిధుల అండదండలతో తరలింపు చేపడుతున్నారు. రైతుల నుంచి పెద్ద ఎత్తున వసూళ్లు చేస్తున్నారు. ఎస్సారెస్పీలో పూడిక మట్టి ప్రతియేడు ఎక్కువగా చేరుతుండటం వల్ల అధికారులు కూడా రైతులకు ఉపయోగపడుతుందని తవ్వకానికి అనుమతులు ఇస్తున్నారు. దీనిని ఆధారంగా చేసుకొని కొంత మంది ప్రజాప్రతినిధులకు చెందిన దగ్గరి బంధువులు ఈ దందాను ఎక్కువ మొత్తంలో కొనసాగిస్తున్నారు. భారీ వాహనాలను ఉపయోగించి తరలింపు చేపడుతున్నారు. ఈ దందా కూడా భిన్నమైన పద్ధతిలో చేస్తున్నారు. దూరాన్ని బట్టి టిప్పర్‌కు 3వేల నుంచి 13వేల వరకు వసూలు చేస్తున్నారు. అంతకుమించి కెపాసిటీ ఉన్న వాహనాలు ఉంటే 16వేల నుంచి 20వేల వరకు వసూలు చేస్తున్నారు. నిత్యం పంచగుడి, ఇతర ప్రాంతాల నుంచి 300 నుంచి 400 వాహనాల ద్వారా ఈ మట్టిని గత 20 రోజులుగా తరలింపు చేస్తున్నారు. ప్రజాప్రతినిధుల దగ్గరి బంధువులే ఈ దందా చేయడం వారి అనుచరులు కూడా సహకరిస్తుండటంతో అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

దెబ్బతింటున్న రోడ్లు

పంచగుడి, ఉమ్మెడ, అన్నారం, సిర్పూర్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల ద్వారా కొత్తగా వేసిన రోడ్లు దెబ్బతింటున్నా పట్టించుకోవడం లేదు. అన్ని ప్రాంతాల్లో గ్రామాభివృద్ధి కమిటీలను మచ్చిగ చేసుకొని వారికి వాహనాలకు ఇంత ముట్ట చెబుతూ మార్గమధ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తరలింపు చేస్తున్నారు. భారీ వాహనాలు కెపాసిటీకి మించి నల్లమట్టిని వేసుకొని వేగంతో వెళ్లడం వల్ల పలుచోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మధ్యనే సీహెచ్ కొండూర్ దగ్గర వాహనం ఢీకొని ఒక ఉపాధ్యాయుడికి చేతు విరుగగా గ్రామస్తులు రెండు గంటల పాటు ఆందోళన నిర్వహించారు. వాహనాలను నిలిపివేయాలని కోరారు. అయినా పట్టించుకోలేదు. అధికారులు ఎలాంటి చర్యలను తీసుకోలేదు. ఎస్సారెస్పీ నిబంధనల ప్రకారం నల్లమట్టి తవ్వకాలు మూడు అడుగుల లోతు వరకే చేయాలి. అంతకు మించి మట్టిని తీయవద్దు. ఈ మట్టిని కూడా పొలాల్లో మాత్రమే ఉపయోగించాలి. నల్లమట్టి తవ్వకాలు మిషన్లతో తీయడం వల్ల నిబంధనలకు మించి ఎక్కువ మొత్తంలో తవ్వకాలు చేస్తున్నారు. 10 ఫీట్లకు పైనే తవ్వుతూ మట్టిని వాహనాల్లో నింపుతున్నారు. అనుమతులు ఇచ్చే సమయంలోనే ఎర్త్‌బండ్‌కు 500 మీటర్ల దూరంలో తవ్వకాలు చేయాలని కోరారు. ఇసుక, రాళ్లు, మొరం తవ్వకాలు చేయవద్దని కోరారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకే తవ్వకాలు వాల్టా చట్టం ప్రకారం చేయాలని కోరారు. ఈ ప్రాంతాల్లో మాత్రం రాత్రివేళల్లో కూడా తవ్వకాలను చేస్తున్నారు. ఎక్కడా నిబంధనలను పాటించడం లేదు. ఎస్సారెస్పీ అధికారులతో పాటు రెవెన్యూ, గణులు, భూగర్భ శాఖ, పోలీస్, ఇతర శాఖ అధికారులు వాల్టా చట్టం ప్రకారం చర్యలు చేపట్టవచ్చు. ఏ శాఖ అధికారులు కూడా ఆ వైపు చూడటం లేదు. కనీసం కెపాసిటీకి మించి మట్టిని తరలిస్తున్న ఎలాంటి చర్యలను చేపట్టడం లేదు. వాహనాలను సీజ్ కూడా చేయడం లేదు.

కులగణన చేయాలన్న నిర్ణయం చరిత్రాత్మకం



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

• అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, మే1 (ఆంధ్రజ్యోతి): జనగణనతోపాటు కులగణన చేయాలని కేంద్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయం నుంచి నిఖిల్‌సాయి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. కులగణన నిర్వహించడం దేశ ప్రజలందరు హర్షించదగ్గ విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనగణన, కులగణన ఆధారంగా దేశంలో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. దేశ భద్రత విషయంలో ఈ దేశ పౌరులు ఎంతమంది, పక్క దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన అక్రమ చొరబాటు దారులు, రోహింగ్యాలు ఎవరనేది పూర్తి లెక్కలు తేలుతాయన్నారు. కేంద్ర మంత్రిమండలి తీసుకున్న నిర్ణయానికి దేశ ప్రజలు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తుంటే కాంగ్రెస్ మాత్రం ఈ విజయం మాదే అంటు గొప్పలు చెప్పుకునే సిగ్గుమాలిన పనిచేస్తుందన్నారు. దేశాన్ని 60ఏళ్లు కాంగ్రెస్ పరిపాలించిన సమయంలో దేశమంతటా ఎందుకు కులగణన నిర్వహించలేదని ప్రశ్నించారు. దీనికి రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో నిర్వహించిన కులగణన తప్పులతడకగా ఉందని అన్నారు. ఒక సామాజిక వర్గాన్నే సంతృప్తి పరిచేందుకు బీసీలకు అన్యాయం చేశారన్నారు. తెలంగాణలో నిర్వహించిన కులగణన చెత్తబుట్టలో వేయడానికి ఉపయోగపడుతుందని కాంగ్రెస్ నాయకులే దానిని తగలబెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. దేశ వ్యాప్తంగా కేంద్రం నిర్వహించే జనగణన, కులగణన పారదర్శకంగా ఉంటుందన్నారు. దేశంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా అందరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా, అందరికి సమాన హక్కులు, రిజర్వేషన్లు అందించడానికి ఒకమైలురాయిలాగా ఉపయోగపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మాట్లాడుతూ దేశమంతటా జనగణన, కులగణన నిర్వహించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, స్వామిదాస్, నాగోల్ల లక్ష్మీనారాయణ, స్రవంతి రెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



మెండోరాలో
44.8 డిగ్రీల
గరిష్ఠ ఉష్ణోగ్రత

నిజామాబాద్ అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల క్రితం జిల్లాలో 45 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా కొద్దిపాటి వర్షం కారణంగా మూడు రోజులుగా జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొద్దిగా తగ్గాయి. అయినప్పటికీ గురువారం జిల్లాలోని మెండోరాలో 44.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మచ్చర్లలో 44.6, వేంపల్లిలో 44.4, కోటగిరిలో 44.2, నిజామాబాద్‌లో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు గురువారం నమోదు అయ్యాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు పైగా నమోదు అవుతుండటంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు.

కులగణన రాహుల్‌గాంధీ ఆలోచనే

• విలేకరుల సమావేశంలో మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్‌హందాన్



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్

నిజామాబాద్ అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేస్తామని ప్రకటించడం అభినందనీయమని.. ఇది కాంగ్రెస్ లోక్‌సభ పక్షనేత రాహుల్‌గాంధీ ఆలోచనేనని ఆయన ఒత్తిడి మేరకే కేంద్రం కులగణనకు ఒప్పుకుందని రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌లు అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో కులగణనకు కేంద్రం ఒప్పుకోవడం ఐదు సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీ కేంద్రంపై ఒత్తిడి తేవడం వల్లే జరిగిందన్నారు. రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా కులగణన చేయాలని చెప్పినప్పుడు చాలా మంది బీజేపీ నాయకులు విమర్శించారని ఓబీసీ హక్కుల గురించి వారికి జరుగుతున్న అన్యాయాల గురించి తెలియని ఎంపీ అర్వింద్ ఇప్పుడు ఎక్కడ మొహం పెట్టుకుంటారని అన్నారు. దేశం మొత్తం కులగణన జరగాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఖచ్చితంగా కులగణన చేస్తామని చెప్పిన రాహుల్‌గాంధీ ఆలోచన మేరకు కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ చెప్పిన అంశాలతో రాష్ట్రంలో కులగణన చేశామని అన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, సీనియర్ నాయకులు రత్నాకర్, జావిద్ అక్రమ్, విపుల్‌గౌడ్, నరేందర్‌గౌడ్, సంతోష్, కేతావత్ యాదగిరి, పాల్గొన్నారు.

చిరుత కోసం ట్రాకింగ్ కెమెరాల ఏర్పాటు

ఆర్మూర్ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై చిరుతపులి కోసం నాలుగు ట్రాకింగ్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఫారెస్ట్ ఎఫ్ఆర్వో శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం రెండు ట్రాకింగ్ కెమెరాలు ఏర్పాటు చేయగా గురువారం సిద్దుల గుట్టను ఫారెస్టు అధికారులు పరిశీలించిన అనంతరం మరో రెండు ట్రాకింగ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. చిరుతపులి సంచార సమాచారాన్ని సేకరించడానికి గుట్టపై వేర్వేరు ప్రదేశంలో ట్రాకింగ్ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సోమవారం సాయంత్రం సిద్దుల గుట్టపై పులి సంచరిస్తున్నట్లు వీడియోలు వైరల్ కావడంతో ఫారెస్టు అధికారులు ప్రతీరోజు సిద్దుల గుట్టను పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తున్నారు. అలాగే సిద్దుల గుట్టపైకి భక్తులు ఎవ్వరిని వెళ్లకుండా రోడ్డును మూసివేశారు. ట్రాకింగ్ కెమెరాలో చిరుతపులి సంచారం తెలిసిన వెంటనే పట్టుకోవడానికి బోనులు ఏర్పాటు చేస్తామని ఫారెస్టు ఎఫ్ఆర్వో శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెంట డీఆర్వోలు ఆర్. శ్రీదేవి, రణవీర్, ఎఫ్ఎస్‌వోలు గణేష్, ఉత్తమ్‌జాదవ్, ఎఫ్‌బీవోలు సంగీత, సుశీల్, ఆలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



సిద్దుల గుట్టపైన పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు



సిద్దుల గుట్టపైకి వెళ్లకుండా మూసివేసిన రోడ్డు

గ్రామాలకు చేరని ఇందిరమ్మ ఇళ్ల పథకం

- పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో సైతం పత్తా లేని పనులు
- ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- రాములగుట్ట తండాకు 47 ఇళ్లకు అనుమతులు
- అవగాహన కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం
- గ్రామంలో ఆరు ఇళ్లకు ముగ్గుపోయగా.. ఒకటే ఇల్లు ప్రారంభమైన వైనం



7


బోధన్‌లో మేడే కార్యక్రమంలో పాల్గొన్న సబ్ కలెక్టర్


ఆర్మూర్‌టౌన్‌లో..


యానం గుట్టవద్ద జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు


మేడే జెండాను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్టీయు యూనియన్ నాయకులు

జిల్లా అంతటా ఘనంగా మేడే వేడుకలు

బోధన్‌రూరల్,మే1(ఆంధ్రజ్యోతి): బోధన్‌లో గురువారం మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు ఎర్ర జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ 139సంవత్సరాల క్రితం అమెరికాలోని చికాగో నగరంలో కార్మిక వర్గం రక్తదర్పణం చేసి 8గంటల పనిదినాన్ని సాధిస్తే నేటి పెట్టుబడిదారి వర్గాలు 10గంటలు, 13గంటలు కార్మికులు పని చేయాలంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని, దేశ పాలకులు ఏకంగా చట్టాలనే మార్చివేసి అమలు చేయుటకు పూనుకుంటున్నారని మండిపడ్డారు. చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మికులను కట్టు బానిసలుగా మార్చివేసే విధంగా చేస్తున్నారని మండిపడ్డారు. కార్మిక వర్గానికి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వ రంగంలోనే కార్మికులు అతి తక్కువ వేతనాలకు పని చేస్తూ వెట్టి చాకిరి గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కుమారస్వామి, ఏశాల గంగాధర్, మల్లేష్, గంగాధర్, గోపి, ప్రభాకర్, దేవదాస్, సంజయ్, మాధవి, పార్వతి, లక్ష్మణ్, శంకర్, నాగమణి, గంగామణి, లక్ష్మి, సీతారాం,కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో కార్మికుల హక్కులకై పోరాడుదాం

చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో కార్మికుల హక్కులకై పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు పుట్ట వరదయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు సాయాగౌడ్, లక్ష్మణ్ గౌడ్, మేకల వినోద్, గీత కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్ గౌడ్,నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నవీపేట: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు.నవీపేట,ఫకీరాబాద్‌లలో సీఐటీయూ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాయక్‌వాడి శ్రీనివాస్ ఉన్నారు.

మోర్తాడ్:మండల కేంద్రంలో గురువారం మాస్‌లైన్ ప్రజాపంతా ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ప్రజాపంతా జిల్లా నాయకులు కిషన్ ఎర్రజెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కిషన్, దశరత్, శ్రీను, గజానంద్, నాగలక్ష్మి, గంగు, రాజు, రాజన్న, సురేందర్, రవి, ముత్తెన్న, నర్సయ్య, గంగాధర్, రాజేశ్వర్, గంగారాం, పోశన్న పాల్గొన్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం 139వ మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎడపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయం ఎదుట సీఐటీయూ జెండాను సీఐటీయూ మండల కన్వీనర్ జంగం గంగాధర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు పద్మక్క, కార్యదర్శి సంతోష్‌కుమార్, భూమవ్వ, గంగాధర్, వసంత్, నాగరాజు,సులోచన,భూదేవి, ప్రవీణ్, లింగం పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండల కేంద్రంలో సీపీఐ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో గురువారం 139వ మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కోటగిరి బస్టాండ్ ఆవరణలో సీపీఐ పార్టీ జెండాను సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షులు గంగాధర్, గీత పనివారాల సంఘం అధ్యక్షులు వెంకట్ గౌడ్, కొత్తపల్లి విండో అధ్యక్షులు సునీల్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు దూద నాయక్, మేదరి శివ, శరత్, శంకర్,అన్వర్, ఇమ్రాన్, పవన్, సంజీవ్, దత్తు పాల్గొన్నారు.

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని ప్రగతిశీల బీడి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎం. ముత్తెన్న మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బి. దేవరాం, బి. కిషన్, రాజేశ్వర్, సత్తెక్క, అరవింద్, శ్రీనివాస్, నజీర్, పద్మ, లక్ష్మీ, సునిత, కార్మికులు పాల్గొన్నారు. 1104 యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని జిరాయత్ నగర్ విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద 1104 యూనియన్ ఆధ్వర్యంలో మేడే సంబురాలను విద్యుత్ కార్మికులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ యూనియన్‌నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రెంజల్: ప్రపంచ 139వ మేడే వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. తాడ్‌బిలోలి గ్రామంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఎర్రజెండాను ఎగురవేసి మేడే వేడుకలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకులు పార్వతి రాజేశ్వర్, పట్టి నాగన్న, నసీర్, పోశెట్టి, పెద్దులు, ఒడ్డెన్న, సాయిలు, వివిధ పార్టీల నాయకులు సాయిరెడ్డి, మొగులనా, శ్రీనివాస్, అనంత్ రావు, ఖుద్దుస్, ప్రసాద్, యోగేష్, సురేష్, అన్వర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్, మే1 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఐక్యంగా జరుపుకునే వేడుకైన మేడేను జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులు ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించారు. కార్మి కులకు ఐక్యంగా పోరాడి మేడే ఉద్యమ స్ఫూర్తిని నింపుకొని ముందుకు సాగాలని వివిధ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఏఐటీయుసీ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కళాశాల, గ్యాస్ ఏజెన్సీ వర్కర్స్ యూనియన్, వ్యవసాయ మార్కెట్ యార్డు సివిల్ సప్లయి కార్పొరేషన్ హమాలీ యూనియన్, కూరగాయల అమ్మకందారుల సంఘం, గాంధీగంజ్, కిషన్‌గంజ్, మదీనామార్కెట్, బోధన్ బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, అంబేద్కర్ కాలనీ, విఠలేశ్వర్ కాలనీలో నిర్వహించిన వేడుకల్లో మేడే జెండాను నాయకులు ఆవిష్కరించారు. నాయకులు, కార్మికులకు పెద్ద ఎత్తున ర్యాలీగా రైల్వేస్టేషన్ వరకు మహాప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, సీనియర్ నాయకులు భూమయ్య, ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షులు చక్రపాణి, కార్యదర్శి హన్మాండ్లు, నాయకులు రాధకుమార్, స్వరూప, స్వప్న, సాయన్న, పరశురాం, దేవేందర్, మోహన్, గంగాధర్, ఇమ్రాన్‌అలీ, ఫిరోజ్, సురేష్, వివిధ రంగాల కార్మికులు తదితరులు పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మేడే వేడుకల్లో మేడు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ కార్మిక వర్గం 8గంటల పనితోపాటు తమ హక్కుల సాధనకోసం పోరాడి తెచ్చుకున్నదే మేడే వేడుకలు అని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కార్మిక వర్గం హక్కుల సాధన కోసం ప్రతిజ్ఞ చేసుకుని మేడే ఉత్సవాన్ని ఘనంగా జరుపుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యురాలు నూర్జహాన్, సుజాత, ఆనంద్, రాములు, రఫీక్, అంజయ్య, ఉద్ధవ్, స్వర్ణ, దినేష్, పాల్గొన్నారు.

సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో:జిల్లా కేంద్రంలోని సీపీఐఎంఎల్ పార్టీ కార్యాలయంలో గురువారం మేడే ను పురస్కరించుకొని జెండా ఆవిష్కరించారు. కుమార్‌నారాయణ భవన్ వద్ద సంయుక్త జిల్లా కార్యదర్శి ప్రభాకర్ జెండాను ఆవిష్కరించారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో నాయకులు జెండాను ఎగురవేసి ఉరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్, దేవరాం, ఠాకూర్, రాజన్న, టీయుసీఐ జిల్లా కార్యదర్శి ముత్తెన్న, గంగన్న, రమేష్, శేఖర్, పద్మలక్ష్మి, సునీత, గంగాధర్, అనిల్, అరవింద్, శ్రీనివాస్, నజీర్, మమత, లింబాద్రి, నిఖిల్, గంగాధర్ పాల్గొన్నారు.

టీయుసీఐ ఆధ్వర్యంలో:139వ మేడే వేడుకను ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయుసీఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ధర్నా చౌక్ మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి మేడే జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుధాకర్, వెంకన్న, కిరణ్, రవి, విఠల్, లింగం, రాజేశ్వర్, గోవర్ధన్, రాములు, సుజాత, యాదమ్మ, శివకుమార్, శాంతికుమార్, పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి గణేస్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబా, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రిటైల్ బట్టల గుమస్తా సంఘం ఆధ్వర్యంలో:అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని రిటైల్ బట్టల గుమస్తా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాలలో రోగులకు పండ్లను అందించారు. ఈ కార్యక్రమంలో రాజు,శ్రీనివాస్,నరేష్,లక్ష్మణ్, రాజు, సత్యదేవ్, గంగాధర్, పాల్గొన్నారు.

● సీపీఐ ఆధ్వర్యంలో మేడే

భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో మేడే వేడుకలను కార్యాలయంలో నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్ర మంలో నగర కార్యదర్శి ఓమయ్య, రఘు, అలీ, ఇమ్రాన్, ఫిరోజ్, అంజలి, దేవేందర్, రాధాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● 8గంటల పనివిధానంకై మేడే స్ఫూర్తితో ఉద్యమిద్దాం

మేడే స్ఫూర్తితో కార్మికులకు 8గంటల పనివిధానానికై ఉద్యమించాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీఐటీయు కార్యాలయంలో మేడే ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్య క్షుడు ఆనంద్, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రాజ్, కోశాధికారి స్వర్ణ, ఆశ యూనియన్ జిల్లా నాయకులు రేణుకసుకన్య, నగేష్, గంగాధర్, మురళీధర్, మహేష్, ఆటో యూనియన్ నాయకులు రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ రూరల్: పట్టణంలోని సీపీఎం ప్రజాసం ఘాల ఆధ్వర్యంలో గురువారం మేడే సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యాలయం వద్ద , యానం గుట్టవద్ద తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్, సీఐటీయు కార్యాలయం వద్ద సుజాత, సబ్‌రిజిస్టర్ కార్యాలయం ముందు కుల్దీప్ శర్మ, అంబేద్కర్ చౌరస్తా వద్ద కుతాడి ఎల్లయ్య, మామిడిపల్లిలో డివిజన్ కమిటి సభ్యులు టి. భూమన్నలు కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొర్ర నాగరాజు, సాయిలు, కల్లుబాయి, లింబాద్రి, రవి,గంగనర్సయ్య, లక్ష్మి, సవిత రాణి, ప్రతీభ, అరుంధతి, లలిత,సరస్వతి,జగదాంబ,నరహరి,కార్మికులు పాల్గొన్నారు.

ఆలూర్: నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండలం మిర్ధాపల్లి, మచ్చర్ల గ్రామాలలో గురువారం మేడే జెండా ను ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మిర్ధాపల్లి గ్రామంలో ఐఎఫ్టీయు ఆధ్వర్యంలో బీడీ కార్మికులు జెండాను ఆవిష్కరించారు. ఆలూర్ మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ వర్కర్స్ మేడే జెండాను ఆవిష్కరించారు. మచ్చర్ల గ్రామంలో ఐఎఫ్‌టీయు నాయకులు జెండాను ఆవిష్కరించారు.

ముప్కాల్:139వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం ముప్కాల్ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఎనిమిది గంటల పనిదినం సాధించుకుందామని మేడే ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు అమీనా, వసంత, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం మేడే వేడుకలను పంచాయితీ కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. జక్రాన్‌పల్లిలో మేడే జెండాను పంచాయితీ కార్మికులు ఆవిష్కరించారు. అనంతరం మేడే సంబురాలను పంచాయితీ కార్మికులు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయితీ కార్మికులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:ప్రపంచ కార్మిక కర్షకుల దినోత్సవం మే డేను కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ అద్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో టీయుసీఐ జిల్లా ఉపాధ్యక్షురాలు వి. సత్తెమ్మ మండల నాయకులు వి. బాలయ్య, బి అశోక్, టి బాలకిషన్, టిబాలయ్య, వి. అశోక్, గంగాధర్, పెద్ది రాజేశ్వర్, ఎన్. మల్లయ్య, పంచాయితి కార్మికులు పాల్గొన్నారు.

పెర్కిట్:ఆర్మూర్ పట్టణంలోని భారత కమ్యునిస్టు పార్టీ ఆధ్వర్యంలో 139వ మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా నాయకులు ఆరెపల్లి సాయిలు ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో గురువారం జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మౌలాన, సోమశీను, సభ్యులు ఫిరోజ్, శ్రీకాంత్, రహీం, పరశురాం, రాజేంధర్, మల్లయ్య పాల్గొన్నారు.

మాక్లూర్: మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఐఎంఎల్ డిపో వద్ద గురువారం జెండా ఎగురువేసి ఘనంగా మేడే ఉత్సవాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎల్ డిపో సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: ప్రపంచ కార్మిక దినం మేడేను పురస్కరించుకొని పట్టణ కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం ముందు ప్రాజెక్టు అధ్యక్షురాలు దేవగంగు ఆధ్వర్యంలో కార్మిక జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ప్రమీల, గంగలక్ష్మి, జ్యోతి, మంజుల, యమునా, బాగ్య, వసంత, స్వరూప, జయంతి, అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: గత 15 సంవత్సరాలుగా సానిటేషన్ విభాగంలో సేవలు చేసిన మున్సిపల్ కార్మికులను మేడే సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ సాయిబాబాగౌడ్, మున్సి పల్ మాజీ వైస్ చైర్మన్ లింగాగౌడ్, ఖాందే శ్రీనివాస్, సానిటరి అధికారి గజానంద్, కాంగ్రెస్ నాయకులు ఖాందేష్ సత్యం, మక్కల సాయినాథ్, జంబిహనుమాన్ కమిటి మాజీ చైర్మన్ చౌకే లింగం, జిరాయత్‌నగర్ హనుమాన్ మందిర్ అభివృద్ధి కమిటి అధ్యక్షుడు అంబల్ల తిరుపతి, కార్యదర్శి నూకల శేఖర్, సభ్యులు విఠోభ శేఖర్, జిందం నరహరి, భాస్కర్ పాల్గొన్నారు.

వేల్పూర్:మండలం ఆధ్వర్యంలో ఘనంగా మేడే కార్యక్రమాన్ని గురువారం నిర్వ హించారు.ఈకార్యక్రమంలో ఐఎఫ్‌టీయు నాయకులు బండి పోశన్న, అనంత్, ఎన్. గంగాధర్, నర్సయ్య, బాబురావు, భాగ్య, రాజన్న, భూమన్న, రాజన్న, తదితులున్నారు.


మాదాపూర్‌లో జెండా ఎగురవేస్తున్న దృశ్యం


కమ్మర్‌పల్లిలో..


భీమ్‌గల్‌లో..


ఆర్మూర్‌లో మున్సిపల్ కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోటగిరి,మే1(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ బాలుర కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ మొబిన్ తెలిపారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ ఇంగ్లీష్ మీడియంలలో మైనారిటీలకు 60సీట్లు, మైనారిటీయేతరులకు 40సీట్లు రిజర్వ్ చేయబడ్డాయన్నారు. 2025లో ఎస్సెస్సీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ కళాశాలలో ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.ఏవైనాసందేహలు ఉంటే మొబైల్ నెంబర్ 915436 5020, 9493040786కు సంప్రదించాలని ఆయన సూచించారు.

'పది' విద్యార్థులకు సన్మానం

నవీపేట,మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థులను గురువారం పాఠశాల ఉపాధ్యాయులు, స్థానికులు ఘనంగా సన్మానించారు. గత మార్చిలో జరిగిన టెన్త్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను బుధవారం విడుదల చేయగా పాఠశాలకు చెందిన విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది, స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు.

యంచ రైస్‌మిల్లులో ఇసుక టిప్పర్లకు తూకం

నవీపేట,మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ రైస్‌మిల్లులోని ధర్మకాంటాలో గురువారం ఇసుక టిప్పర్లకు తూకం నిర్వహించారు. సుమారు 15ఇసుక టిప్పర్లను స్థానిక రైస్‌మిల్లులో ఉన్న ధర్మకాంటాకు తరలించి అందులో తూకం వేశారని పేర్కొంటూ పలువురు సంబంధిత ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ వెంకట రమణ, ఎస్‌ఐ వినయ్‌లను వివరణ కోరగా సంబంధిత ఇసుక టిప్పర్లు బోధన్ మండలం సిద్ధాపూర్ నుంచి బాసర రైల్వే బ్రిడ్జి పనుల కోసం వేబిల్లుల అనుమతితో వెళ్తున్నాయని అన్నారు. ఇసుక పరిమాణాన్ని కొలమానం కోసం రైస్‌మిల్లు వద్ద ఉన్న ధర్మకాంటా వద్ద వారు తూకం వేసి ఉంటారని తహసీల్దార్, ఎస్‌ఐలు వివరించారు.

ఏఐడబ్ల్యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామనాథం

బాల్కొండ, మే 1(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం వన్నెల్(బి)కి చెందిన రాజుల రామనాథం తెలంగాణ రాష్ట్ర ఏఐడబ్ల్యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా జాతీయ వినియోగదారుల సమాఖ్య ఏఐడబ్ల్యూసీ చైర్మన్ విఖ్యత్ పెనాయ్‌జనరల్ సెక్రటరీ దేవేంద్ర తివారిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఖేలో ఇండియా సెపక్‌తక్రాకు జిల్లా క్రీడాకారులు

సుభాష్‌నగర్, మే1 (ఆంధ్రజ్యోతి):ఖేలో ఇండియా నిర్వహించనున్న సెపక్‌తక్రా జాతీయ స్థాయి క్రీడలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు సెపక్‌తక్రా జిల్లా అసోసియేషన్ కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాదారి సంజీవ్‌రెడ్డి తెలిపారు. మే 4 నుంచి బిహార్‌లోని పాట్నా రాష్ట్రంలో జరిగే అండర్-18 సెపక్‌తక్రా పోటీలకు బాలుర విభాగంలో సాత్విక్‌రెడ్డి, బాలికల విభాగంలో నల్లభవ్యశ్రీలు ఎంపిక య్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఖేలో ఇండియాకు ఎంపిక కావడం పట్ల అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు ప్రణాళికబద్ధంగా కృషి చేయాలి: ఏసీపీ

బోధన్‌రూరల్,మే1(ఆంధ్రజ్యోతి): జీవితంలో ఏదైనా సాధించాలంటే ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని అప్పుడే విజయం సాధించవచ్చని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని విజయసాయి పాఠశాలలో పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఆయన అభినందించారు. విజయసాయిలో 10వ తరగతిలో 417మంది విద్యార్థులు ఉండగా అందరు విద్యార్థులు ఉత్తీర్ణులు అవ్వడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆర్మూర్ టౌన్, మే 1(ఆంధ్రజ్యోతి) :మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ చెందిన సయ్యద్ జాఫర్ (42) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యానారాయణ తెలిపారు. సయ్యద్ జాఫర్ మద్యానికి బానిసై జీవితం పై విరక్తి చెంది గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో బుదవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఆయన తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

కోటగిరి,మే1(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని సోంపూర్ గ్రామానికి చెందిన సంజీవ్(42)అనే వ్యక్తి మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు కోటగిరి ఎస్‌ఐ సునీల్ తెలిపారు. సంజీవ్‌కు ఇద్దరు భార్యలు కాగా మొదటి భార్యకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెండవ భార్య భర్తకు దూరంగా ఉంటుంది. సంజీవ్ గత కొంతకాలంగా మద్యానికి బానిసై తరచు ఇంట్లో మొదటి భార్య పిల్లలను వేధించేవాడన్నారు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటిపైకప్పులో కర్రకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు.

విద్యుత్ భద్రత వారోత్సవాలు

సుభాష్‌నగర్, మే1 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు భద్రతా చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ డివిజనల్ ఇంజనీర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పవర్‌హౌజ్ కంపౌండ్ కార్యాలయంలో గురువారం విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ వైర్లను సరిచేసేటప్పుడు చేతికి గ్లౌజ్ వేసుకోవాలన్నారు. ఈ వారోత్సవాలు మే 1 నుంచి 7వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అనంతరం విద్యుత్ భద్రత వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి, టౌన్1 ఏఈ నాగేష్, టౌన్6 ఏఈ ఎంఏ రావూఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఆర్మూర్ టౌన్, మే 1(ఆంధ్రజ్యోతి) :మండలంలోని చేపూర్ గ్రామానికి చెందిన ముత్యాల సుష్మ (47) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. సుష్మ మానసిక స్థితి బాగలేక ఆసుపత్రిలో చికిత్స చేయించిన నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై పురుగులు మందు తాగగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గుర్తుతెలియని శవం లభ్యం

మోపాల్, మే1 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కాల్పోల్ అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని శవం కుళ్లిపోయి ఉన్నట్లు గురువారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మహిళ శవం కుళ్లిపోయినట్లు స్థానికులు గుర్తించారు. దట్టమైన అటవీప్రాంతం ఉండటంతో పోలీసులు ఎవరూ అక్కడ సంఘటన స్థలానికి చేరుకోలేదు. ఈ శవం మోపాల్ పోలీస్ స్టేషన్ లేక వర్ని పోలీస్ స్టేషన్‌కు వస్తుందా అని పోలీసులు అయోమయంలో ఉన్నారు. రాత్రి కావడంతో సంఘటన స్థలానికి ఎవరూ వెళ్లలేదు. ఈ విషయాన్ని మోపాల్ ఎస్సై యాదగిరిని అడుగగా ఇప్పటి వరకు తమకు ఎవరూ ఎలాంటి సమాచారం ఇవ్వలేదని ఫారెస్టు అధికారులు మాత్రం తమకు సమాచారం అందించినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం సంఘటన స్థలానికి వెళ్తున్నట్లు తెలిపారు.

ముదక్‌పల్లి గ్రామాన్ని సందర్శించిన డీపీవో

మోపాల్,మే1(ఆంధ్రజ్యోతి):మండలంలోని ముదక్‌పల్లి గ్రామాన్ని గురువారం జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి శ్రీనివాస్ సందర్శించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలో ఉన్న నర్సరీలను పరిశీలించి ఎండాకాలంలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులు ఉన్నారు.

అనాథ శవాలకు అంత్యక్రియలు

నిజామాబాద్ కల్చరల్, మే1 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలో గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన గుర్తుతెలియని రెండు అనాథ శవాలకు ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ గురువారం అంత్యక్రియలు నిర్వహించింది. నాగారంలోని క్రిస్టియన్ స్మశాన వాటిక నందు అనాథ శవానికి క్రిస్టియన్ సాంప్రదాయ పద్ధతిలో ప్రార్థనలు చేసి అంత్యక్రియలు నిర్వహించగా మరో అనాథ శవానికి దుబ్బ రోడ్‌లోగల సార్వజనిక్ శ్మశాన వాటికలో హిందూసాంప్రదాయపద్ధతిలో అంత్యక్రియలు జరిపారు. ఈకార్యక్రమంలో ఒకటోటౌన్ సీఐ,ఇందూరు యువత స్వచ్ఛందసేవా సంస్థ అధ్యక్షుడు సాయిబాబు,సంస్థప్రతినిధులు,పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు మైనార్టీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యుపిఎస్‌సి పరీక్షల కోసం వంద మంది మైనార్టీలకు ఉచిత శిక్షణ కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ అధికారిణి కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లీం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్దులు మరియు పార్శీలు దరఖాస్తులు చేసుకోవచ్చని రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33 శాతం సీట్లు, వికలాంగులకు 5 శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందని అన్నారు. పూర్తిగా మెరిట్ ప్రతిపాధికన హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. యుపిఎస్‌సి 2026 యొక్క సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రవేశం కోసం డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థులు మే 1 నుంచి సీఈటీ.సిజిజి.జివోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 24 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని జూన్ 5వ తేదీన అన్ని జిల్లా కేంద్రాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఇతర వివరాలకు 040-23236112, 9700351786 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

హైకోర్టు ఆదాయపు పన్నుశాఖలో జూనియర్ స్టాండింగ్ కౌన్సిల్‌గా బండి గణేష్ నియామకం


బండి గణేష్

ఆర్మూర్‌టౌన్,మే 1(ఆంధ్రజ్యోతి): ఆర్థిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఈ విషయం లో ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మూడేళ్ల పాటు జూనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా కొనసాగుతారు. బండి గణేష్ గత కొన్ని సంవత్సరాలుగా హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. యువ న్యాయవాదిగా, ఆదాయపు పన్ను శాఖకు హైకోర్టులో జూనియర్ స్టాండింగ్ కౌన్సెల్‌గా పని చేసే అవకాశం ఆయనకు లభించింది. బండి గణేష్ పదోన్నతిపై గురువారం ఆర్మూర్ ప్రజలు సంతోషం వ్యక్తం చేసి ఆయనను అభినందించారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

భీమ్‌గల్, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెజ్జోర గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 25 ట్రిప్పుల ఇసుకను రెవెన్యూ అధికారులు గతనెల 29న సీజ్ చేశారు. ఇట్టి ఇసుకకు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం గురువారం తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్ తహసీల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో మండలానికి చెందిన ఏడుగురు పాల్గొనగా బాబాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ షబ్బీర్ రూ.51 వేలకు వేలం దక్కించుకున్నారు.ఈకార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐలు మల్లేష్, సాయగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మెండోర ఎస్సైగా యాసిర్ అర్ఫత్

మెండోర,మే1(ఆంధ్రజ్యోతి):మెండోర ఎస్సైగా యాసిర్ అర్ఫత్ గురు వారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద టూ టౌన్ నుంచి మెండోర ఎస్సైగా బదిలీపై వచ్చినట్లు తెలిపారు.ఈ సందర్భంగా నూతన ఎస్సైకి పో లీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ సిబ్బంది స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వరద కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య

మోర్తాడ్,మే1(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి చెందిన కత్తికొల్ల గోపి నాథ్ (51)అనే వ్యక్తి వరద కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై విక్రం తెలిపారు.గోపినాథ్‌కు ఎడమకాలు అనారోగ్య సమస్యలతో బాధపడు తున్నాడని, అంతేకాక అతని కూతురు ప్రేమ వివాహం చేసుకొని గొడవల కా రణంగా ఇంట్లోనే ఉండడం వల్ల మనస్తాపం చెంది జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి 10 గంటలకు ఇంటినుంచి వెళ్లి వరద కాలువలో దూకి చని పోయాడని తెలిపారు. గురువారం వరద కాలువలో శవమై తేలడంతో ఆయనను గుర్తించారు. భార్య మానస ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టంకి పంపించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవీపేట,మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామలో గురువారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించారు. గ్రామానికి చెందిన సుమారు 215 తెలుపు, నలుపు జాతి పశువులకు ఈ టీకాలను అందించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య శాఖ సిబ్బంది హుస్సేన్, రవి, గోపాల మిత్ర సిబ్బంది ఉన్నారు.

మాక్లూర్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కిరణ్‌దేశ్‌పాండే కోరారు. గురువారం మండలంలోని వల్లబాపూర్, మెట్‌పల్లి గ్రామాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వినిత, కళ్యాణి, హైమద్‌పాషాతో పాటు రైతులు పాల్గొన్నారు.

గ్రామాలకు చేరని ఇందిరమ్మ ఇళ్ల పథకం

● పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో సైతం పత్తా లేని పనులు ● ఆశగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు ● రాములగుట్ట తండాకు 47 ఇళ్లకు అనుమతులు
● అవగాహన కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం ● గ్రామంలో ఆరు ఇళ్లకు ముగ్గుపోయగా ఒకటే ఇల్లు ప్రారంభమైన వైనం

నసురుల్లాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నిరుపేదలకు సొంత ఇల్లు ఇవ్వాలన్న ఉద్దేశంతో ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సొంత ఇంటి కోసం పేద మధ్య తరగతి వారు ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూస్తూ, సొంత ఇంటి కల నెరవేరుతుంది అన్న ఆశలు ముందుకు సాగడం లేదు. జనవరి 21 నుంచి 25 వరకు జరిగిన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జనవరి 26న పైలెట్ ప్రాజెక్టులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలం నుంచి ఒక గ్రామాన్ని ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి కలెక్టర్ ఆమోదించి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశిస్తున్నా కూడా నిర్మాణ పనులు ఎక్కడ వేసి గొంగడి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారైంది.


రాములగుట్ట తండాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణ పనులు

● నమూనా ఇంటి నిర్మాణంలో అలసత్వం

ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణానికి నిబంధనల ప్రకారం కట్టుకోవడానికి ప్రతీ మండలంలో ఓ నమూనా ఇంటిని నిర్మించనున్నారు. దీంతో పనులు యుద్ధ ప్రాతిపదికన జరిగితే నమూనా ఇంటి నిర్మాణం ప్రకారం నిర్మించుకోవాలన్న ఆలోచనలో లబ్ధిదారులు ఉన్నారు. మండలానికి ఒక గ్రామం ఎంపిక చేసి ఆయా గ్రామాల్లో పనులు సాగించాలన్న కూడా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా పనులు చేపడుతున్నారు. అదే విధంగా ప్రతి మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో నమూనా ఇళ్ల పనులు నత్తనడకన కొనసాగు తున్నాయి.

● జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ ఆమోదం పొందిన ఇళ్లు

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 535 గ్రామసభల్లో 28,653 మంది లబ్ధిదారులు సొంతింటి నిర్మాణం కోసం దరఖాస్తుల చేసుకున్నారు. అందుకు ఎల్123గా లబ్ధిదారులను విభజించారు. 22 మండలాల్లో ప్రతి మండలం నుంచి ఓ గ్రామాన్ని ఎంపిక చేసి 1672 మందిని కలెక్టర్ ఆమోదించారు. వీరందరికీ ఇంటి నిర్మాణం చేపట్టాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. కాని నిబంధనలకు తలొగ్గి వెనక్కు తగ్గుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.

ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన కల్పిస్తున్నాం



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. కాని లబ్ధిదారులు డబ్బులు లేక కొంత సమయం తీసుకుని ఇళ్ల నిర్మాణం చేపడతామని అంటున్నారు. త్వరలో పైలెట్ ప్రాజెక్టు గ్రామం అయిన రాముల గుట్ట తండాలో ఇంది రమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇల్లు నిర్మించుకోవాలని కోరుతాం.

● సూర్యకాంత్, ఎంపీడీవో, నసురుల్లాబాద్

ఫటా..ఫట్...

నిజాంసాగర్ మండలంలో 86 చెరువులు

● శివప్రసాద్, నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్



చెరువుల అవసరాలను బట్టి వర్షాకాలానికి మరమ్మతులు చేపట్టనున్నట్లు నీటి పారుదల శాఖ అధికారి శివప్రసాద్ ఆంధ్రజ్యోతికి వివరించారు.

ఆంధ్రజ్యోతి: నిజాంసాగర్ మండలంలో నీటిపారుదల శాఖ ఆధీనంలో ఎన్ని చెరువులు కుంటలు పర్లేషన్ ట్యాంకులు ఉన్నాయి ఈ చెరువుల కుంటల కింద ఆయకట్టు ఎంత సాగవుతుంది?

అధికారి: నిజాంసాగర్ మండలంలో 86 చెరువులు, కుంటలతో పాటు పార్కులేషన్ ట్యాంకులు ఉన్నాయని పర్లేషన్ ట్యాంకుల్లో నీటి నిల్వలు, కుంటలు కాగా 86 చెరువుకుంటల కింద 3,800 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాకాలంలో పూర్తిస్థాయిలో ఆయకట్టు సాగయిందన్నారు. 65 శాతం మేరకే రైతులు వరితో పాటు వాణిజ్య పంటలు పండించు కున్నారు.

ఆంధ్రజ్యోతి: మండలంలోని చెరువు, కుంటలకు మరమ్మతులు చేయడానికి ప్రణాళిక రూపొందించారా? ఇప్పటి వరకు అత్యవసరంగా ఏదైనా చెరువులను మరమ్మత్తులు చేశారా?

అధికారి: మండలంలో 86 చెరువుల కుంటల గాను అవసరాన్ని బట్టి మరమ్మతుల కోసం ప్రణాళిక రూపొందిస్తాం. ఇప్పటి వరకు సింగీతం గ్రామ శివారులో మీడెక్క చెరువు మూడు లక్షల 40 వేల రూపాయలతో చెరువు అలుగును మరమ్మతులు చేయడం జరిగింది. ఈ చెరువు పూర్తి ఆయకట్టు నాలుగు ఎకరాలు.

ఆంధ్రజ్యోతి: నిజాంసాగర్ ఉమ్మడి మండలంలోని సింగీతం రిజర్వాయర్‌కు మరమ్మతులు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారా?

అధికారి: సింగీతం రిజర్వాయర్ మరమ్మతుల కోసం ప్రభుత్వానికి కోటి 75 లక్షల రూపాయల ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఇది రిజర్వాయర్ కిందట 385 ఎకరాలు సాగవుతుంది.

ఆంధ్రజ్యోతి: సింగీతం రిజర్వాయర్ ఎన్ని టీఎంసీల నీటి సామర్థ్యం గల రిజర్వాయర్ అని ఈ ప్రాజెక్టులోనికి ఎన్ని ఎంసి ఏఫ్టీల నీరు ఎగువ నుంచి వస్తుంది?

అధికారి: సంగీతం రిజర్వాయర్ 300 ఎంసీఎఫ్టీల నీటి సామర్థ్యం గల రిజర్వాయర్ అని ఎగువ నుండి వర్షాకాలంలో 600 ఎంసిఏఫ్టీల నీరు వచ్చి చేరుతుందని ఇప్పటి వరకు ఈ రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువ మంజీరా నదిలోనికి ఒక టీఎంసీ నీటిని విడుదల చేసినట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: మండలంలోని చెరువు కుంటల నుండి రైతులకు ఎవరి ఆధ్వర్యంలో సాగునీటిని విడుదల చేస్తున్నారు. నీటిని వృధా కాకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

అధికారి: మండలంలోని చెరువు కుంటల ఆయకట్టుకు నీటి పారుదల శాఖ సిబ్బంది ద్వారానే నీటిని విడుదల చేస్తున్నామని వీఆర్ఏ లు లేనందున సిబ్బంది రైతుల అవసరాన్ని బట్టి నీటిని విడుదల చేస్తూ నీరు వృథా కాకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నారు.

● (నిజాంసాగర్, ఆంధ్రజ్యోతి)

పిచ్చిమొక్కలతో నిండిపోయిన మురికి కాలువలు

పెర్కిట్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని 23వ వార్డులో శ్రీరాంనగర్ కాలనీ, విద్యానగర్ కాలనీల సరిహద్దులో గల ప్రాంతంలో మురికి కాలువలు పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ఈ మార్గంలో స్థానికులు, పాఠశాలలకు వెళ్లడానికి అధిక సంఖ్యలో సంచరిస్తుంటారు. దారిపక్కనే గల మురికి కాలువ అసంపూర్తిగా నిర్మించబడి ఉండడం వల్ల మురికి నీరు ఒకచోట చేరి పిచ్చిమొక్కలతో నిండిపోయింది. పిచ్చి మొక్కలు దట్టంగా పెరగడంతో ఆ మార్గంగుండా వచ్చేవారికి మురికి కాలువ ఉన్నదని తెలియక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మార్గంలో విద్యుత్ స్తంబాలకు బిగించిన వీధిదీపాలు పనిచేయడం లేదు. రాత్రి సమయంలో ఈ మార్గంలో వెళ్లడానికి చీకటిలో స్థానికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. వాహనదారులు చీకటిలో పలుమార్లు మురికి కాలువలోకి దూసుకుపోయి గాయాలపాలయ్యారు. ఈ మార్గం గుండా పాఠశాలలు ఎక్కువగా ఉండడం వల్ల విద్యార్థిని విద్యార్థులు సైకిల్‌మీద వచ్చేవారు తీవ్ర ఇబ్బందులపాలవుతున్నారు. వెంటనే సం బంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న మురికి కాలువను పూర్తిగా శుభ్రం చేసి మరమ్మతులు చేపట్టి, అదేవిదంగా పాడై పోయిన వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


పిచ్చిమొక్కలతో నిండిపోయిన మురికి కాలువలు


అసంపూర్తిగా ఉన్న మురికి కాలువలు

అసంపూర్తిగా ఉన్న మురుగు కాలువ
వెంటనే మరమ్మతులు చేపట్టాలి: రాము, స్థానికుడు

అసంపూర్తిగా మురికి కాలువ ఉండడం వలన ఎగువ నుండి వచ్చే మురికి నీరు ఒకచోట చేరడంతో దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నాం. అదే విధంగా చుట్టు పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి ఉండడంతో అక్కడ మురికి కాలువ ఉన్నది గుర్తించలేకపోతున్నారు. వెంటనే మున్సిపాలిటీ వారు చొరవ తీసుకొని డ్రైనేజీని పూర్తిచేసి మురికి కాలువను వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఖాళీ బిందెలతో నిరసన


పొతంగల్ మండల పరిషత్ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన

కోటగిరి, మే 1 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రంలోని పలు కాలనీల్లో తాగునీటి సమస్య తలెత్తడంతో ఆయా కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పొతంగల్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట గురువారం తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని బాజిరెడ్డి, ఒడ్డెర, ఎస్సీ కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా తలెత్తిందన్నారు. గత కొన్ని నెలల నుంచి కుళాయిల్లో నీళ్ల రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. తమ సమస్యను అటు పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించాలని మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంపీడీవో చందర్ తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.


వృథాగా పోతున్న నీరు

నర్వ పాతచెరువు కాల్వకు బుంగలు

● సైడ్‌వాల్ ధ్వంసం కావడంతో నీరు వృథా
● మరమ్మతులు చేయాలంటున్నరైతులు

మహమ్మద్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వగ్రామంలో గల పాతచెరువు నర్వతూము పంటకాలువ కింద 160 ఎకరాలలో పంటలను రైతులు సాగుచేస్తారు.ఈ కాల్వకు సైడ్ వాల్ పూర్తిగా దెబ్బతినడంతో నీరు వృదాగా వాగులోకి పోతుంది. దీంతో నీరు సరిగా అందక రైతులు దిగుబడి తగ్గుతుందని రైతులు పేర్కొంటున్నారు. చిన్న, సన్నకారు రైతులకు సాగునీరు అందక తీవ్రమైన ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. గతంలో కూడా ఇలాగే అయితే రైతులు తాత్కలిక మరమ్మతులు చేసుకున్నారు.మట్టిపూర్తిగా కొట్టుకుపోయి వాగులోకి నీరు వృదాగా పోతుందని పేర్కొం టున్నారు. వచ్చేది వర్షాకాలం కావడంతో అధికారులు స్పందిచి కాల్వ మరమ్మతులను చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కాలువ నిర్మాణ పనులు చేపట్టాలి
● రాజేందర్, రైతు

నర్వ పాత చెరువు తూము పూర్తిగా దెబ్బతింది. తూము కింద పంట కాలువ పూర్తిగా చెడిపోవడంతో నీరు వృథాగా వాగులోకి పోతుంది. అధికారులు మరమ్మతులు చేసి వాన కాలం పంటకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలి.


దెబ్బ తిన్న కాల్వ సైడ్‌వాల్

గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిస్తాం

ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి సమావేశానికి రాని వీడీసీ సభ్యులు


ఈత చెట్లను పరిశీలిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి


గీత కార్మికులతో మాట్లాడుతున్న అధికారులు

ఏర్గట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి) : గత కొన్ని నెలలుగా తాళ్ల రాంపూర్ గ్రామంలోని గీత కార్మికులను విడీసి మధ్య జరుగుతున్న వివాదాన్ని పరిష్కరించేందుకు అధికారులు గురువారం మండలంలోని తాళ్ల రాంపూర్ గ్రామంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గీత కార్మికులకు విడీసి సభ్యులతో ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్‌లు సమావేశం ఏర్పాటు చేయగా విడీసి సభ్యులు అందుబాటులో లేకపోవడంతో హాజరు కాలేకపోయారు. ఈ సందర్భంగా అధికారులు గీత కార్మికులకు సంబంధించిన కాలిపోయిన ఈత చెట్లను పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న విషయం చాలా ఉద్రిక్తంగా మారకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, రామాలయంలో మహిళలకు అడ్డుకొన్న వారిపై కేసులు వేయడం జరిగిందని, గౌడ మహిళలు తమకు వీలైన సమయంలో దగ్గరుండి రామాలాయంలో పూజలు చేయిస్తామని ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి తెలుపగా దానికి గౌడ మహిళలు విడీసి రద్దు అయ్యేంత వరకు గుడికి వచ్చేది లేదని స్పష్టం చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, రెచ్చగొట్టే విధంగా ప్రయత్నం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీడీసీ సభ్యులతో పాటు గీతకార్మికులతో మరోమారు సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కస్తామీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ మల్లయ్య, ఎస్సై రాము, గీత కార్మికలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలి

● తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్



జాన్కంపేట్ చర్చి వార్షికోత్సవంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్

వేల్పూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవా లని తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్‌జాన్ అన్నారు. గురువారం ఆయన వేల్పూర్ మండలం జాన్కంపెట గ్రామంలోని ఇండిపెండెంట్ బాప్టిస్టు చర్చి వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. సమాజంలో అన్ని వర్గాల వారికి కార్పోరేషన్‌లు ఏర్పాటు చేసి ఉపాధి పథకాలు అమలు చేస్తుం దన్నారు. క్రైస్తవులకు అమలు చేస్తున్న పథకాల గురించి తెల్సుకొని ఉపయోగించుకోవాలన్నారు. క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులు సివిల్స్ గ్రూప్, బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ వంటి ఉద్యోగాలు సాదించేందుకు ఉచితంగా శిక్షణ ఇస్తుందన్నారు. సివిల్స్‌లో రెండవ బ్యాచ్ కోచింగ్ ప్రారంభమైందని, కోచింగ్ తీసుకునే వారు ధరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం దీపక్ జాన్‌ను చర్చి తరుపన శాలువతో ఘనంగ సన్మానించారు. ఈ చర్చి వార్షికోత్సవం సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాస్టర్లు మోహన్, నోవాక్, డేవిడ్, ప్రభాకర్, దేవనందం, కాంతాయ్య, అనంతరావు, సునీల్, జీవరత్నం, వివిధ గ్రామాల చర్చిల పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులు నృత్యాలు చేస్తున్న దృశ్యం

తొర్లికొండలో వేసవి సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

జక్రాన్‌పల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొర్లికొండ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా క్రీడ ప్రతాదికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం వేసవి సాఫ్ట్‌బాల్ శిక్షణ శిభిరాన్ని ఎంఈవో శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడల్లో పాల్గొని సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిక్షణ శిబిరం జూన్ 6వ తేదీవరకు సాయంత్రం ప్రతీరోజు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాయమ ఉపాధ్యాయ సంఘం , జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లేష్‌గౌడ్, స్థానిక పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు గంగమోహన్, క్రీడాకారులు , విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


వేసవి సాఫ్ట్‌బాల్ శిక్షణ శిభిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో

నిజాంపూర్ ఎత్తిపోతల పథకం 250 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం


నిజాంపూర్ ఎత్తిపోతల పథకం ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమైన దృశ్యం


ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ వినయ్


ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన దిమ్మె

● కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను చోరీ చేసిన దుండగులు

నవీపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిజాంపూర్ ఎత్తిపోతల పథకంకు సంబంధించి 250కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను గత నెల 29న అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను చోరీ చేశారు. ఎస్ఐ వినయ్, స్థానిక రైతులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంపూర్ శివారులో గోదావరి నది ఒడ్డున ఉన్న ఎత్తిపోతల పథకం వద్ద రాతి దిమ్మెపై 250కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ కాయిల్స్, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. నిజాంపూర్, లింగాపూర్, బినోల గ్రామాలకు చెందిన సుమారు 1600ఎకరాల ఆయకట్టుకు ఈ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను దిమ్మెపై నుండి కిందికి దింపి దుండగులు పూర్తిగా ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఇరిగేషన్ ఏఈ ప్రణయ్ రెడ్డి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై వినయ్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్థానిక రైతుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఏ మాత్రం పని చేయదని నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడానికి సుమారు 6నుండి 8లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. దొంగలను త్వరగా పట్టుకుని వారిని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

కార్మికులు లేనిదే గంజ్ లేదు: రూరల్ ఎమ్మెల్యే



గంజ్‌లో కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే



జెండాను ఎగురవేస్తున్న రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్



జెండా ఎగురవేస్తున్న టీడీపీ నాయకులు

మోపాల్, మే1 (ఆంధ్రజ్యోతి): కార్మికులు లేనిదే మార్కెట్ యార్డు లేదని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. గురువారం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మేడే సందర్భంగా ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ఆధ్వర్యంలో కార్మికులకు బట్టల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే అంటేనే కార్మిక సమస్యలు పరిష్కారం చేసే దినమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పక్షాన ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. మార్కెట్ యార్డుకు పదేళ్లుగా పెద్దదిక్కు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి మంచి పేరుందన్నారు. ఇన్సూరెన్స్, లేబర్ శాఖ, ప్రభుత్వంతో మాట్లాడి కార్మికులం ద రికి ఇన్సూరెన్స్ సౌకర్యం అందేలా చూస్తామన్నారు. లైసెన్స్ లేని కార్మికు లందరికి లైసెన్స్ ఇప్పిస్తామన్నారు. వెల్ఫేర్ బోర్డును కూడా ఏర్పాటు చేస్తామన్నారు. కార్మిక భవనం నిర్మాణం కోసం తమవంతు కృషిచేస్తామ న్నారు.ఈ కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోర్కంటి లింగన్న, కార్మి కులు, తదితరులు పాల్గొన్నారు.

● మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. గురువారం నిజామాబాద్ మార్కెట్ యార్డులో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను రూరల్ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు, భోజనం, టిఫిన్స్, టీ తక్కువ ధరలో నాణ్యమైనవి అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

● జెండా ఆవిష్కరించిన రూరల్ ఎమ్మెల్యే

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మేడే సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్మికులు ఐకమత్యంతో ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఇందల్వాయి: ఇందల్వాయి మండల కేంద్రంలోని భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో గురువారం మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు జగన్ మేడే జెండాను ఎగరవేశారు. మున్సిపల్ కార్మికులు, గ్రామ పంచాయతీ కార్మికులు సైతం మేడే జెండాను ఎగరవేసి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల జిల్లా అధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులందరికి గతంలో 34 రోజులు సమ్మె చేసినప్పుడు ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పంచాయతీ కార్మికులకు కేటగిరి వారిగా ప్రభుత్వమే స్వయంగా గ్రాంట్ రూపంలో ప్రతి కార్మికుడికి ప్రతీనెల 1వ తేదీన జీతాలు ఇవ్వాలని, ఐఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు మేదరి గంగారాం, మండల కార్మికులు రాజు, నగేష్, మల్లన్న, గంగారాం, బుచ్చన్న, బిక్షపతి, గంగామణి, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్: మేడే ను పురస్కరించుకొని బీడి మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంజ్దూర్ సంఘ్ కార్యదర్శి సాయిరెడ్డి, జనరల్ సెక్రెటరి స్వామి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మోహన్, రాజన్న, రెంజర్ల తార, ఉమాదేవి, బీడి కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: తెలంగాణ యూనివర్సిటీ ఔట్ సోర్సింగ్ ఆధ్వర్యంలో మేడే దినోత్సవం గురువారం కళాశాల ఎదురుగా మేడే జెండాను వర్సిటీ యూనియన్ జనరల్ సెక్రటరి బికోజీ ఆవిష్కరించారు. వర్సిటీ లో ఔట్ సోర్సింగ్ సిబ్బంది చాలిచాలనీ వేతనాలతో తమ జీవితాలను నెట్టుకొస్తున్నరని పెరిగిన ధరలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వలన్నారు. ఈ కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ నాయకులు జేపీ గంగాధర్,సాయినాథ్, భారతి,రవీందర్ నాయక్,నరేశ్,సుధీర్,మధులిక,స్వప్న,తిరుపతి, పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: రాజ్యాంగం కల్పించిన కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని బీఎల్‌టీయు రాష్ట్ర అధ్యక్షుడు దండివెంకట్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక కోడ్‌లు తీసుకొచ్చి భారత బహుజన కార్మిక వర్గాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టుబానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, సబ్బ నిలత, మేకల రాజేందర్, రాజ్‌కుమార్, అనిల్‌కుమార్, గంగశంకర్, రాహుల్, శిరీష్, వెంకటస్వామి, ప్రవీణ్, నవీన్, ఎల్లయ్య, మురళీ, శ్రీశైలం, వసంత్, మోహన్‌గౌడ్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

మోపాల్: మండలంలో మేడే సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. మేడే జెండాను ఆవిష్కరించారు. బోర్గాం(పి) చౌరస్తాలో జెండాను ఆవిష్కరించారు. మోపాల్‌లో అల్లూరి సీతారామరాజు నగర్‌లో జెండాను ఆవిష్కరించారు. మోపాల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వర్కర్స్ ఆధ్వర్యంలో మేడే జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు నారాయణ, బాలరాజు, రమేష్, సాయిలు, పోశెట్టి, శోభ, లక్ష్మి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ పార్టీ కార్యాలయం ఎదుట కార్మిక జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కార్మికులు మేడే స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర కన్వీనర్ అంబిక సత్యానారాయణ, బొబ్బ నర్సింహారావు, మావూరి రాజశేఖర్, పురుషోత్తం, రాజు, విష్ణు, ప్రభాకర్, రవికుమార్, నటరాజ్, రమేష్, కోటేశ్వర్‌రావు, రషీదా, బిందు, రమణ, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి: మేడే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో మేడే సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్మికులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం, కార్మికుల పనిగంటల తగ్గుదల కోసం, కార్మిక వేతనాల పెంపు కోసం, సరైన వేతనం సాగిన పోరాటంలో చిందిన ఎర్రటి రక్తమే ఈ ఎర్ర జెండా అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, దామోదర్, లింబాద్రి, నరేష్, కిరణ్, ఆశన్న, సాయిలు, కృష్ణ, భోజన్న, గంగాధర్, వసంత, రాజు, తదితరులు పాల్గొన్నారు

కేసీఆర్‌ను విమర్శిస్తే కాంగ్రెస్ నాయకులను తిరగనివ్వం

● మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

సుభాష్‌నగర్, మే1 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్‌ను విమర్శిస్తే కాంగ్రెస్ నాయకులకు గ్రామాల్లో తిరగనివ్వమని, ఇకపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ పథకాలు ఆగిపోయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటున్నాడని, ఏ ఒక్క పథకం కూడా పూర్తిగా అమలు కావడం లేదని అన్నారు. కేసీఆర్ కిట్టుతో సహా కంటివెలుగు, కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ తదితర పథకాలపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర సంక్షేమం అవసరం లేదని ఏడుగురు కుటుంబ సభ్యుల సంక్షేమమే అవసరమన్నారు. కేసీఆర్‌ది ఫామ్ హౌస్ కాదని ఫార్మర్ హౌస్ అని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ సభలో రేవంత్ రెడ్డి పేరు పలకలేదనే అక్కసుతోనే మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు. కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి చేయడంలోనే పోటీపడితే ప్రస్తుతం సీఎం సమాధులు కట్టడంలో పోటీ పడుతున్నాడని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఆనవాళ్లను తీసివేయడం ఎవరి తరం కాదని అన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ ఉన్నాడన్నారు. భారతదేశం ఉన్నన్ని రోజులు కేసీఆర్ చరిత్ర ఉంటుందన్నారు. రేవంత్ రెడ్డి ఏ పార్టీ కోసం పనిచేస్తున్నాడో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. ఆయన ఔట్ సోర్సింగ్ ముఖ్యమంత్రి అని, ముఖ్యమంత్రిగా కాంగ్రెస్‌లో ఔట్‌సోర్సింగ్‌గా పనిచేస్తున్నాడని అన్నారు. తెలంగాణ రైతులకు ఆంధ్రోళ్లు వ్యవసాయం చేయడం నేర్పారని తెలంగాణ రైతులను అవమానించాడన్నారు. రేవంత్ రెడ్డిది టీడీపీ భజన అని, చంద్రబాబు జపం అని, హైటెక్ సిటీని చూస్తే చంద్రబాబే గుర్తుకొస్తున్నాడని చెబుతాడని అన్నారు. ఎప్పటికైనా కాంగ్రెస్ చేతికి సున్నం పెట్టడం ఖాయమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ప్రభాకర్ రెడ్డి, రాంకిషన్‌రావు, సత్యప్రకాష్, సుజీత్‌సింగ్ ఠాకుర్, కూజా నరేందర్, పోల సుధాకర్, రాజేశ్వర్ రెడ్డి, తెలంగాణ శంకర్, వెల్మల్‌రాజన్న, మోహన్, రజనీష్, నవీద్ ఇక్బాల్,ఖురేషీ, దండుశేఖర్,నవీన్,సూర్యసన్ని, రవి,తదితరులు పాల్గొన్నారు.

ఆడంబరాలకు పోతే అప్పులే: పోచారం



వర్నిలో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

వర్ని,మే1(ఆంధ్రజ్యోతి): ఆడ పిల్లల పెళ్లిళ్ల విషయంలో ఆడంబరాలకు పోతే చివరికి చివరికి అప్పులే మిగులుతాయని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హితవు చెప్పారు. గురువారం వర్ని మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను వర్ని ఉమ్మడి మండలాల లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నిరుపేదలు ఆడబిడ్డల పెళ్లిళ్లు లక్షల రూపాయలు పెట్టి వివాహాలు చేయకుండా గ్రామాల్లోనే ఫంక్షన్ హాల్‌లో నిర్మించామని అందుకు కేవలం రూ.5వేలు అద్దె చెల్లిస్తే చాలని వెల్లడించారు. ఖర్చులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లోనే వివాహాలు జరపాలని సూచించారు. ప్రైవేటు ఫంక్షన్ హాల్ జోలికి వెళితే చివరకు అప్పులే మిగులుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కులకర్ణి సురేష్, నామాల సాయిబాబా, అంబర్ సింగ్, రాంజ్యా నాయక్, నారోజి గంగారాం, పిట్ల శ్రీరాం, బి.సత్యనారాయణ, గైక్వాడ్ హన్మంతు, బుద్దె గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్ విజయవంతంలో జిల్లా వాసి



రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిలతో సుధాకర్‌గౌడ్

నిజామాబాద్ అర్బన్, మే1 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రపంచ దేశాలలోని పారిశ్రామిక వేత్తల పెట్టుబడులే లక్ష్యంగా ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్ 2025 విజయవంతంలో జిల్లాకు చెందిన ఇండియన్ ఓవర్సిస్ కాంగ్రెస్ యుకె చాప్టర్ ఉపాధ్యక్షుడు రంగుల సుధాకర్‌గౌడ్ పాత్ర కీలకంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా వంద దేశాలకు పైగా ప్రతి నిధులు పాల్గొన్న ఈ సమ్మిట్‌లో కాంగ్రెస్ పార్టీ యువనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రివర్గం, జాతీయ స్థాయి కాంగ్రెస్ నాయకులంతా ఈ సమ్మిట్‌లో పాల్గొన్నారు. ప్రపంచ దేశాలకు తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులు పెట్టేందుకు ఏ విధంగా అనుకూలమైందో వివరించడంలో సుధాకర్‌గౌడ్ కీలక పాత్ర పోషించారు. ప్రపంచ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధుల ప్రతిరోజు షెడ్యూల్‌తో పాటు సమ్మిట్‌లో ఏ అంశాలు రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేందుకు ప్రభావితం చేస్తాయో వాటిని విదేశీ ప్రతినిధులకు వివరించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి యుకే పర్యటన మొత్తం సుధాకర్‌గౌడ్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఆయన పని తీరును గమనించిన సీఎం భారత్ సమ్మిట్ నిర్వహణలో ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించారు. సమ్మిట్ విజయవంతం కావడంతో సుధాకర్‌గౌడ్‌ను సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లు అభినందించారు.

కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



మేడే వేడుకల్లో పాల్గొన్న రత్నాకర్

నిజామాబాద్ అర్బన్, మే1 (ఆంధ్ర జ్యోతి): నిజామాబాద్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మేడే వేడుకల్లో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరాల రత్నాకర్ మేడే జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల యొక్క శ్రమ మీదనే సంపద సృష్టించబడుతుందని అలాంటి శ్రామిక జనానికి గుర్తింపుగా మేడే నిర్వహించడం అభినందనీయమ న్నారు. స్వా తంత్ర్యం రాకముందు భారతదేశంలో 14గంటల పనిదినాలు ఉండేదని స్వాతంత్ర్యం అనంతరం 8గంటల పనిదినాన్ని అమలు చేస్తూ కార్మికు లకు సంఘాలను పెట్టుకొని సమ్మె చేసే హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. అదే స్ఫూర్తితో నేడు తెలంగాణలో పారిశ్రామిక అభివృ ద్ధికి కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కార్మికులకు అనేక సం క్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జావిద్ అక్రమ్, సేవాదల్ అధ్యక్షుడు సంతోష్, ఐఎన్‌టియుసి అధ్యక్షుడు మల్యాల గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

పాస్.. పర్సంటేజ్ లాస్ట్

● బెస్ట్ మార్కులతో స్టేట్ ఫస్ట్ ● పదో తరగతి ఫలితాల్లో నగరంలో ఇదీ తీరు

నిజామాబాద్ అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి ఫలితాలలో జిల్లా 96.62 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో 16వ స్థానంలో నిలిచింది. అయినప్పటికీ నిజామాబాద్ అర్బన్‌లో పదవ తరగతి ఫలితాలు మాత్రం ఆశించిన విధంగా రాలేదు. పరీక్షలు నిజామాబాద్ నగరంలో పకడ్బందీగా నిర్వహించగా రూరల్ ప్రాంతాల్లో మాత్రం చూచి రాతల పర్వం సాగినట్లు ప్రచారం జరిగింది. జిల్లా విద్యాశాఖ అధికారులు సైతం నిజామాబాద్ నగరంపై ప్రత్యేక దృష్టిని పెట్టి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినప్పటికీ నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో టాప్ మార్కులు రావడం జరిగింది. గతంలో నిజామాబాద్ నగరంలో చూచి రాతల ఒరవడి ఉందని ప్రచారం నిర్వహించిన వారికి చెంపపెట్టులా రాష్ట్రస్థాయిలోనే నలుగురు విద్యార్థులకు టాప్ మార్కులు రావడం సమాధానం దొరికినట్లు అయ్యింది. నిజామాబాద్ నార్త్, సౌత్ మండలాల నుంచి 4298 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరుకాగా 3898 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. 400 మంది విద్యార్థులు నగరంలో ఫెయిల్ అయ్యారు. నిజామాబాద్ సౌత్‌లో 308 మంది విద్యార్థులు ఫెయిల్ కాగా నిజామాబాద్ నార్త్‌లో కేవలం 92 మంది మాత్రమే ఫెయిల్ అయ్యారు. జిల్లా వ్యాప్తంగా మండలాల వారిగా పదవ తరగతి ఫలితాలలో నిజామాబాద్ సౌత్ మండలం 84 ఉత్తీర్ణత శాతంతో చివరి స్థానంలో ఉండగా నార్త్ మండలం 96 శాతం ఉత్తీర్ణత సాధించింది.

● ప్రైవేట్‌లలో ఫలితాల జోరు... సర్కారులో ఫలితాలు బోరు

నిజామాబాద్ నార్త్, సౌత్ మండలాల్లో పదవ తరగతి ఫలితాల్లో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. సుమారు వంద మందికి పైగా విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించారు. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం ఆశించిన ఫలితాలు రాలేదు. నిజామాబాద్ సౌత్‌లో 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా మొత్తం 361 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. 240 మంది పాస్ కాగా 90 మంది ఫెయిల్ అయ్యారు. నిజామాబాద్ నార్త్‌లో 5 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా 248 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 210 మంది పాస్ కాగా 38 మంది ఫెయిల్ అయ్యారు. ప్రైవేటు పాఠశాలలు మాత్రం చాలా మట్టుకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి.

● నగరంలో పరీక్షల తీరుపై విమర్శలు

నగరంలో పదవ తరగతి పరీక్షలను నిర్వహించిన తీరుపై విమర్శలు వచ్చాయి. నగరానికి ఆనుకొని ఉన్న చుట్టుపక్కల గ్రామాలలో పదవ తరగతి పరీక్షల్లో చూచి రాతల పర్వం కొనసాగగా నిజామాబాద్ నగరంలో మాత్రం విద్యాశాఖ అధికారులు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించిన అంశంపై అనేక సార్లు బహిరంగంగా విమర్శలు చేశారు. నగరంలోని ప్రైవేటు పాఠశాలలపై కక్షపూరితంగా కొంత మందిని ఇతర ప్రాంతాల నుంచి ఇన్విజిలేటర్లతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లుగా నియమించి పరీక్షలను ఇష్టారీతిగా నిర్వహించారనే విమర్శలు ఉన్నాయి. కొన్ని ప్రైవేటు పాఠశాలలే టార్గెట్‌గా పరీక్షల నిర్వహణ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. పదవ తరగతి ఫలితాలలో జిల్లా వ్యాప్తంగా 766 మంది విద్యార్థులు ఫెయిల్ కాగా ఒక్క నిజామాబాద్ నగరంలోనే 400 మంది విద్యార్థులు ఫెయిల్ కావడం నగరంలో పరీక్ష నిర్వాహణకు అద్దం పడుతుంది. అయినప్పటికీ నగరంలోని ఓ ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి టాప్ మార్కులు సాధించడం గమన్నార్హం.

రాష్ట్రస్థాయి టాప్ మార్కులు రావడం అభినందనీయం



నిజామాబాద్ నగరంలోని నార్త్, సౌత్ మండలాల్లో పదవ తరగతి ఫలితాల తీరుపై సమగ్ర విశ్లేషణ జరుపుతాం. ఫలితాలు తక్కువ గా రావడానికి గల కారణాలను విశ్లేషిస్తాం. ప్రభుత్వ పాఠ శాలల్లో ఫలితాలు తక్కువగా వచ్చిన ప్రతి అంశాన్ని పరిశీలిస్తాం. అయినప్పటికీ నిజామాబాద్ నగరానికి చెందిన విద్యార్థులకు రాష్ట్రస్థాయి టాప్ మార్కులు రావడం అభినందనీయం.

- డీఈవో అశోక్

‘పది’లో స్టేట్ టాపర్‌కు ఘన సన్మానం

● రాష్ట్రస్థాయి టాప్ మార్కులు రావడం గర్వంగా ఉంది
● క్రితి తల్లిదండ్రులు సిర్ప కృష్ణ, సృజన



క్రితితో తల్లిదండ్రులు

నిజామాబాద్ అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాలలో రాష్ట్రస్థాయిలోనే టాప్ మార్కులు తమ కూతురు సిర్ప క్రితికి రావడంపై తల్లిదండ్రులు సిర్ప కృష్ణ, సృజనలు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో టాప్ మార్కులు సాధించిన క్రితిని గురువారం కాకతీయ ఒలింపియాడ్ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను సైతం కాకతీయ యాజమాన్యం సన్మానించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఇద్దరం కూడా డాక్టర్లుగా పనిచేస్తూ వృత్తిలో బిజీగా ఉన్నప్పటికీ పాఠశాల యాజమాన్యం విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి విద్యాబోధన చేయడం వల్లే తమ కూతురికి రాష్ట్రస్థాయి ర్యాంకు వచ్చిందన్నారు. డాక్టర్లుగా తాము బిజీగా ఉండి తమ కూతురు చదువుపై పూర్తిశ్రద్ధ పెట్టకపోయినా కాకతీయ యాజమాన్యం, ఒలింపియాడ్ స్కూల్ డైరెక్టర్లు తేజస్విని, రామోజీరావులు ప్రతీరోజు పర్యవేక్షణ చేయడం వల్లే రాష్ట్రస్థాయి టాప్ మార్కులు వచ్చాయన్నారు. ఒలింపియాడ్ పాఠశాలలో ఐఐటీ జేఈఈ మెయిన్స్ స్థాయి అధ్యాపకులతో పాఠశాల స్థాయిలో బోధించడం, ఉదయం ఐఐటీ ఫౌండేషన్ తరగతులు, మధ్యాహ్నం రెగ్యులర్ సిలబస్ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్న తీరు ఎంతో గొప్పదన్నారు. క్రితి ఈ స్థాయి టాప్ ర్యాంకులు సాధించడం కాకతీయ ఒలింపియాడ్ స్కూల్ వల్లే సాధ్యమైందన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన గడుగు



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో గడుగు

నిజామాబాద్ అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావును రైతు కమీషన్ సభ్యులు గడుగు గంగాధర్, భవానిరెడ్డిలు గురువారం హైదరాబాద్‌లో కలిసి ఆయనను అభినందిం చారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా గతంలో లాగానే ఆయన నిబద్ధతతో పనిచేస్తారని వారు తెలిపారు. వారి వెంట మెంబర్ సెక్రెటరీ గోవింద్ కూడా ఉన్నారు.

ఎస్సెస్సీ టాపర్లను సన్మానించిన రూరల్ ఎమ్మెల్యే

ధర్పల్లి, మే1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల లిటిల్ హార్ట్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులను గురువారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సన్మానించారు. ఇటీవల ప్రకటించిన ఎస్సెస్సీ ఫలితాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటి మండల టాపర్లుగా నిలిచారు. పాఠశాలకు చెందిన వర్ష 579, అనన్య 567, వినయ్ 567తో పాటు వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపై ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్, డైరెక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేపు హెచ్‌సీఏ క్రికెట్ టీమ్‌ల ఎంపిక

సుభాష్‌నగర్, మే1 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల క్రికెట్ టోర్నమెంట్‌కు జిల్లా టీమ్‌లను ఎంపిక చేస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రసేన్ రెడ్డి, వెంకట్ రెడ్డిలు తెలిపారు. మే 3వ తేదీన నగరంలోని జీజీ కాలేజ్ మైదానంలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 5జట్లు ఎంపిక చేసి అందులో అత్యంత ప్రతిభ కనబర్చిన 15మంది క్రీడాకారులను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ రెండు రోజుల టోర్నమెంట్‌కు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 19సంవత్సరాల నుంచి 25సంవత్సరాల లోపు వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఉదయం 6గంటలకు మైదానానికి చేరుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

సుభాష్‌నగర్, మే1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక ను ఏర్పాటు చేస్తున్నట్లు డీఈ శ్రీనివాస్, ఏడీఈ చంద్రశేఖర్‌లు తెలిపారు. నగరంలోని డీ 4 సెక్షన్ కార్యాలయంలో సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బోర్గాం (బి), వినాయక్‌నగర్, నాగారం సెక్షన్‌లకు చెందిన విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలు ఉంటే ఫిర్యాదులు చేయాలన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఎరుకల నారాయణ, పాల్గొంటారని తెలిపారు.

6వ టౌన్ కానిస్టేబుల్ గజానంద్ జాదవ్ సస్పెన్షన్

నిజామాబాద్ అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 6వ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి జిల్లా కోర్టు విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ గజానంద్ జాదవ్‌ను సస్పెండ్ చేస్తూ పోలీస్ కమీషనర్ సాయిచైతన్య ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టులో వివిధ నేరాలకు సంబంధించిన క్రైమ్ తాత్కాలిక ప్రాపర్టీ రిలీజ్ కేసులలో పెద్ద మొత్తంలో డబ్బులు స్వీకరించి వివిధ కేసులలో అవినీతికి పాల్పడినట్లు 6వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు కాగా సీపీ గజానంద్ జాదవ్‌ను సస్పెండ్ చేశారు. పలు ప్రైవేటు చీటీల యాజమాన్యుల సహకారంతో 4 నుంచి 5 చీటీలు వేసి మోస పూరితంగా తన తోటి సిబ్బందిని, మిత్రులను గ్యారంటీరులుగా పెట్టి ఆచిట్టీలకు సంబంధించిన మొత్తం డబ్బులను తీసుకొని కట్టకపోగా తనకు మాత్రం ఎటువంటి రికవరీలు కాకుండా జాగ్రత్తలు పడుతూ మిత్రులకు, తోటి సిబ్బందికి మాత్రమే మోసపూరితంగా రికవరీ అయ్యేలా నాల్గవటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయం సీపీ దృష్టికి రావడంతో క్రమశిక్షణచర్యల్లో భాగంగా కానిస్టేబుల్‌నుసస్పెండ్ చేస్తూఉత్తర్వులు జారీ చేశారు.ఇటువంటిచర్యలను సహించేదిలేదనిసీపీ హెచ్చరించారు.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.130	రూ.240	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.250	రూ. 270

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.97200	రూ.89,650	రూ.1000

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : హిట్-3 (9.50, 1.05, 4.20, 7.35, 10.50)
స్క్రీన్-2 : రిట్రో (10.10, 4.25, 10.40)
: తండర్‌బోల్ట్స్ (3డి తెలుగు) (1.35, 7.50)
స్క్రీన్-3 : రైడ్-2 (హిందీ) (10.00, 4.25, 10.50)
: రిట్రో (1.00, 7.25)
స్క్రీన్-4 : తుదురం (10.15, 1.35)
: సారంగపాని జాతకం (4.55)
: రైడ్-2 (హిందీ) (7.45)
: జింఖానా (10.45)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : హిట్-3 (10.30, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : తండర్ బోల్ట్స్ (ఇంగ్లీష్) (11.00, 4.40)
: రి ట్రో (1.30, 7.20, 10.30)
స్క్రీన్-3 : రైడ్-2 (హిందీ) (11.00, 1.40, 4.30, 10.30)
: తండర్ బోల్ట్స్ (ఇంగ్లీష్) (7.40)

లలితామహల్ : రిట్రో (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : తండర్ బోల్ట్స్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : రైడ్-2 (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : హిట్-3 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్